వాయిద్యముల నుపయోగింతురు. అట్టి వారు కేవలము అవిధేయులే. మనము దేవుని ఆజ్ఞలకు కలుపుటగాని తీసి వేయుటగాని చేయరాదు.

దేవుడు మననుండి పరిపూర్ణ విధేయతను కోరుచున్నారు. మన విధేయతలో ఏమాత్రము తక్కువయినా ఆయన మనలను అంగీకరించరు. అందుకే మనదేవుని పూర్ణహృదయము తోను, పూర్ణమనస్సుతోను, పూర్ణ ఆత్మతోను ప్రేమించవలెనని క్రీస్తు చెప్పెను. దేవుడు నిన్ను నీ సేవను అంగీకరించవలెనని నీవు కోరుచున్న యెడల ఆయన యిచ్చు ప్రాధమిక ఆజ్ఞలకు మొదట లోబడుము. క్రీస్తును నమ్ముకొనుము. నీపాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనుము. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది సువార్తకు విధేయుడవుకమ్ము. అటు తరువాత నీ మరణ పర్యంతము లేక క్రీస్తు మరల వచ్చు పర్యంతము ఆయనకు విధేయతకలిగి జీవించుము. అంత్యదినమున ఆయన నిన్ను నిత్య రక్షణలో ప్రవేశింపజేయును.

## తీర్పు నాడు నీవేమి చెబుతావు?

### ( What will you say at the Judgement ? )

భక్తి భావములు గల ప్రతివాడు తీర్పును గూర్చి ఎరిగియున్న వాడే, దేవునితో మానవుడు సమావేశమయ్యే ఈ సంఘటనను గూర్చి బైబిలు విశద ముగా బోధించుచున్నది. యేసు ఈ లోకంలో యున్నప్పుడు రాబోవు తీర్పును గూర్చి బోధించారు.

“మనుష్యులు పలుకు వ్యర్ధమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసియుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పుపొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పుపొందుదువు’’ (మత్తయి 12:36,37).

“తండ్రి యెవనికిని తీర్పుతీర్చడు గాని తండ్రిని ఘనపర్చునట్లుగా



అందరు కుమారుని ఘనపరచవలెనని తీర్పుతీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించియున్నాడు’’ (యోహాను 5:22).

‘‘నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును” (యోహాను 12:48). అపొస్తులుడైన పౌలు కూడ తీర్పును గూర్చి ఇట్లుచెప్పాడు.

“ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి, చూడనట్లుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను అందరును మారు మనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత భూలోకమునకు తీర్పుతీర్చబోయెడి యొకదినమును నిర్ణయించియున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపి నందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు’’ (అపో.కా. 17:30,31). “ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తున్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును” (2 కొరింథీ 5:10). “దేవుని యెదుటను సజీవులకును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తుయేసు యెదుటను.. నేను అనబెట్టి చెప్పుదేమనగా” (2తిమో. 4: 1,2). “మనుష్యులొక్క సారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పుజరుగును’’ (హెబ్రీ 9:27).

అపొస్తలులైన పేతురు యోహానులు కూడ తీర్పును గూర్చి ఇట్లు హెచ్చరించిరి.

“భక్తులను శోధనలో నుండి తప్పించుటకును.. శిక్షలో ఉంచబడిన వారిని తీర్పుదినము వరకు కావలిలో ఉంచుటకును ప్రభువు సమర్ధుడు” (2 పేతరు 2:9).

తీర్పుదినము యొక్క దృశ్యాన్ని

భక్తుడైన యోహాను ఇట్లు వర్ణించాడు.

“మరియు ధవళమైన మహా సింహాసనమును దానియందు ఆసీనుడై యున్న యొకనిని చూచితిని; భూమ్యా కాశములు ఆయన సముఖము నుండి పారిపోయెను; వాటికి నిలువచోటు కనబడకపోయెను. మరియు గొప్ప వారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము యెదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను; మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను. ఆ గ్రంథముల యందు వ్రాయబడి యున్నవాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి” (ప్రకటన 20:11-13).

## దండన ఉందండోయ్ !

అహరోను కుమారులు
నాదాబు అబీహులు
ధూపార్తులు చేతబట్టి
అన్యాగ్నిని తెచ్చిపెట్టి
దైవాగ్నితో దహనమైరి!

ఆధునిక బోధకులలో కొందరు
నాదాబు అబీహుల వలెనే నేడు
ప్రతిష్ఠితములో లౌకికమును
పవిత్రతలో అపవిత్రతను,
చేర్చి కూర్చుకుంటున్నారు పాపాన్ని!

యాజక బోధక వర్గానికి
అప్పుడే చెప్పాడు దేవుడు
ప్రతిష్ఠితములో లౌకికమును
అపవిత్రత నుండి పవిత్రతను
వేరుపరచుటే తమ విధియని !

సర్వజ్ఞులమనే స్వనీతిపరులు
ప్రజలమనే మెప్పునేకోరు పాస్టరయ్యలు
అధర్మకారులైన ఆచార్యులు
ఆత్మ గద్దింపులను అలక్ష్యం చేసేవాళ్ళు
ప్రచండాగ్ని దండనకు పాత్రులవ్వరా??

(హెబ్రీ 10: 26-31)

- యస్.జె. మేడిది, కొణితివాడ.



# దేవుని ఆలయము

## ( God's Temple )

కొరింథులో యున్న క్రీస్తు సంఘమునుకు పౌలు ఇట్లు చెప్పాడు. “మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశు ద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకారు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి” (1 కొరింధీ 6:19,20). కొరింథులోని ప్రజలు ఈ లోకభారములను విడిచి సువార్తకు విధేయులై నిజదేవుని, యేసుక్రీస్తును అంగీకరించిరి. వారు క్రైస్తవులు, క్రీస్తు సంఘస్థులు అయిరి. “మీరు మీ సొత్తుకారు” అని పౌలు వారికి చెప్పాడు. మన దేహము దేవునికే చెందును. ఆయన తన స్వ రక్తముతో మనలను కొన్నారు. మన శరీరాత్మలు ఆయనవే. అందువలన మన దేహముతో దేవుని మహిమ పర్చాలి.

క్రైస్తవుడైన వాడు తన శరీరాన్ని దుర్వినియోగం చేసినా, అపవిత్ర పరచినా అతడు దేవుని ఆత్మ నివసించు ఆలయాన్ని అపవిత్ర పరుచును. “మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా? ఎవడైనను దేవుని ఆలయమును పాడు చేసిన యెడల దేవుడు వానిని పాడు చేయును” (1కొరింధీ 3:16,17). మనం దేవుని ఆలయమై యున్నాము గనుక, దేవునితో పాడుచేయబడ కుండు నిమిత్తము మన దేహములను అపవిత్రపరచకూడదు.

పాపమును గూర్చి మత శాఖల వారు వివిధ రీతులగు బోధింతురు. ఆత్మయే పాపం చేయును గాని దేహము కాదని కొందరంటారు. మరి కొందరేమో శరీరమే గాని ఆత్మ పాపము చేయదంటారు. అయితే ఈ సమస్యకు బైబిలే జవాబిచ్చుచున్నది : “పాపము చేయువాడే మరణము నొందును” (The Soul that sinneth, it shall die) అని యెహెజ్కేలు 18:4లో పరిశుద్ధాత్ముడు చెప్పారు. గనుక “శరీర దురాశలకు లోబడు